ఆ రోడ్లపై ప్రయాణం భయంభయం

- ప్రధాన మార్గాలు.. ప్రమాదాలకు నెలవులు
- మృత్యువాత పడుతున్న వాహనచోదకులు


ప్రమాదకరంగా ఉన్న పెనుగొండ శివారు సిద్ధాంతం రోడ్డు మలుపు

పెనుగొండ: రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ముఖ్యంగా నిత్యం రద్దీగాఉండే ప్రధాన రహదారుల్లోఉన్న మలుపులు వాహనచోదకులను భయపెడుతున్నాయి. పెను గొండలో లింగాలవీధి వద్ద ఒకవైపు మలుపు, మరోవైపు లింగాల వీధిలో నుంచి వాహనాలు రోడ్డుపైకి నేరుగా వచ్చే విధంగా ఉండడంతో నిత్యం ఇక్కడ ఏదో ఒక ప్రమాదం సంభవిస్తునే ఉంది. చిన్నపాటి ప్రమాదాలు జరిగినపుడు వాహనచోదకుల మధ్య రగడ తారాస్థాయికి చేరుతుంది. ఈ మలుపులో ఇటీవల ఓ వ్యక్తి సైకిల్‌పై వెళుతుండగా ప్రమాదానికి గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఇదే పరిస్థితి పెనుగొండ పెరవలి రహదారినుంచి సిద్ధాంతం వైపువెళ్లే మలుపులోనూ నెలకొంది. ఇక్కడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పెనుగొండ నక్కల డ్రెయిన్ వద్ద మలుపులో ఈ ఏడాది కాలంలో ఇద్దరు ముగ్గురు మృతి చెందడంతో పాటు, పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇటీవల రెండు ఇటుక ట్రాక్టర్లు మలుపులో అదుపు తప్పి పంట బోదెలో బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వడలి రామన్నపాలెం మధ్య ఉన్న మలుపు, దొంగరావిపాలెం వద్ద మలుపు ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

మార్జిన్ లేని రోడ్లు

సిద్ధాంతం పంచాయతీవద్ద, చెరుకువాడలో మలుపు వద్ద రహదారికి మార్జిన్ లేకపోవడంతో వాహనచోదకులు అదుపతప్పి పడిపోతున్నారు. నడిపూడి - చినమల్లం, ఇలపర్రు వద్ద, ములపర్రు వద్ద రోడ్డు మలుపులు ఉన్నాయి. ఆయా మలుపుల వద్ద సరైన ప్రమాదపు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాటిని గుర్తించేలోపే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కళాశాల మలుపు వద్ద వేగం తగ్గించడానికి వేసిన స్పీడు బ్రేకర్ల వద్ద నిత్యం ప్రమాదాలు జరగడంతో వాటిని తొలగించారు. స్పీడు బ్రేకర్లు వేయడం కన్నా హెచ్చరిక బోర్డు, లైనర్లు వేయడం వల్ల ప్రమాదాలను కొంతవరకు అరికట్టవచ్చని వాహనచోదకులు సూచిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాద నివారణ కు చర్యలు తీసుకోవాలని పలువురుకోరుతున్నారు.


నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన పెనుగొండ లింగాల వీధి మొగ మలుపు


చెరుకువాడలో మార్జిన్ లేని రహదారి

క్లుప్తంగా

క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న సీఐ, ఎస్సైలు

నరసాపురం రూరల్: విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రొత్సహించాల్సిన అవసరం ఉందని నరసాపురం రూరల్ సీఐ జి.దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం కొప్పరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వాలీబాల్ పోల్స్, వాలీబాల్ కిట్లను ఆయన నరసాపురం రూరల్ ఎస్సై టి.వెంకట సురేష్‌తో కలిసి ప్రధానోపాధ్యాయుడు ఎస్ తాతయ్యకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి భవిష్యత్తుపై ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, సాధించాలని అన్నారు. ఆటల్లో రాణించిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు వివిధ క్రీడాలపై పట్టు సాధించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని తెలిపారు. టీవీ, సెల్ ఫోన్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలు అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సమాచార హక్కు చట్టంపై వివరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. గురువారం కళాశాలలో ఏపీ కళాశాల కమిషనరేట్ వారి ఉత్తర్వుల మేరకు నిర్వహించిన ఈ సదస్సులో ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమాచార హక్కు చట్టం 2005పై వ్యాసరచన, వక్తృత్వం, చర్చ, క్విజ్ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు సీహెచ్ ఉషారాణి, బూసి వెంకటస్వామి, వి.విజయలక్ష్మి, బి.రామలక్ష్మి, వి.శిరీష, కె.పార్థసారధి, ఎం శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సాగు ఖర్చు ఆదా


వడలిలో డ్రోన్ అందిస్తున్న అధికారులు

పెనుగొండ: యాంత్రీకరణతో వ్యవసాయంలో సాగు ఖర్చు ఆదా చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్ అన్నారు. శుక్రవారం వడలిలో డ్వాక్రా గ్రూపుకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ స్ప్రేయర్‌ను అందించారు. షణ్ముక గ్రూపు సభ్యులు వెలగన స్వాతి, చిటికెన స్వాతి సభ్యులు డ్రోన్‌ను అందుకొన్నారు. ఇది 10 నిమిషాల్లోనే ఎకరం పొలంకు మందును పిచికారీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.స్పందన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అనగాని జిల్లా పర్యటన

భీమవరం (ప్రకాశంచౌక్) / నరసాపురం: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మొగల్తూరు మండలం కాళీపట్నం (వెస్ట్), నరసాపురం, ఆచంటలో ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని పేర్కొంది.

అచ్యుతానందన్‌కు ఘన నివాళి


అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌కు సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం సీపీఎం పెనుగొండ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ అచ్యుతానందన్ పోరాట స్ఫూర్తిని వివరించారు. సమర్థ నాయకుడుని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్‌కే పాదుషా, కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, పులిదిండి రామారావు, మాదాసు నాగేశ్వరరావు, రాజమహేంద్రవరపు వెంకటేష్, గుడిమెట్ల వరహాలు రెడ్డిలు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నరసాపురం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం స్థానిక కోర్టు సముదాయం వద్ద సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దానయ్య నాయుడు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తేవాలని కోరారు. డెత్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని, న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నరసాపురం శాఖ అధ్యక్షుడు కానూరి బుజ్జి, పులపర్తి హర్ష, మల్లేడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో అన్నదానం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాజమండ్రికి చెందిన బీరం నరసింహరావు, విజయలక్ష్మి దంపతులు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించార. సుమారు 280 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్, కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, గ్రామస్తులు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రత్తిపాడు వై. జంక్షన్ దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద కనకదుర్గమ్మకు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పరిసరాల శుభ్రతపై అవగాహనా కార్యక్రమం

పాలకొల్లు సెంట్రల్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఎం నవ్య జీవన్ అన్నారు. గురువారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో లంకలకోడేరు గ్రామంలో జాతీయ డెంగీ మాసోత్సవం, ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే డెంగీ వంటి వ్యాధులు ధరిచేరవన్నారు. దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోధ, మెదడువాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వివరించారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సంబంధిత ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకొని, మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ ఎన్‌పీ ఎలిజిబెత్, సూపర్‌వైజర్ ఎస్కే అమలేశ్వరరావు, ఎం దివాకర్‌బాబు, టి.హరిబాబు, ఎల్‌టీ ప్రసాద్, మార్తమ్మ, సుశీల, రోజా కమల, జ్ఞానమణి, ఆశ కార్యకర్తలు, ట్రైనీ ఏఎంలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్సై

నరసాపురం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి సూచించారు. శుక్రవారం వైఎన్ కళాశాలలో జాతీయ సేవాపథకం, నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకమే ఏకైక మార్గమన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ వయోపరిమితి మేర డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ, హెచ్ఆర్డీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించండి


ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 25వ వార్డు యాగర్లపల్లి ప్రాంతంలోను, అదే విధంగా రామాలయం సమీపంలోని ఖాళీ స్థలాలలో భారీగా పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలు, ముళ్ల మొక్కలు వేపుగా పెరుగుతున్నాయని, దీంతో వాటితో స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు ఇక్కట్లు పడుతున్నామని సత్యనారాయణ, నాగమణి, కె.అప్పారావు తదితర స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మొక్కలు కారణంగా కారణంగా ఉబ్బసం వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. అంతేగాక వీటితో పాటు విష సర్పాలు తిరుగుతున్నాయని, కొన్ని సమయాలలో అవి ఇంటిలోకి వస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా డ్రెయినేజీల్లో సైతం మురుగు ముందుకు పారడం లేదని, వ్యర్థాలు ఎక్కడవి అక్కడే ఉంటున్నాయని చెప్పారు. మునిసిపల్ అధికారులు వార్డును సందర్శించాలని, ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించి, మురుగునీరు ముందుకు సాగే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భావితరాల ఆరోగ్యానికి సేంద్రియ సాగు


మాట్లాడుతున్న డీపీఎం నూకరాజు

తాడేపల్లిగూడెం రూరల్: భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు కోరారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూకరాజు మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న పొలంలో కొంత సేంద్రియ విధానంలో పంటలు పండించాలన్నారు. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, కషాయాల ద్వారా వ్యవసాయం చేయాలన్నారు. తద్వారా సాగులో ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కోడిగుడ్లు నిమ్మరసం ద్రావణం, అగ్నాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు ఏఓలు నారాయణరావు, చిర్ల రవికుమార్, ఏఈఓ డి.విద్యాసాగర్, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు


బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శ్రావణ మాసం తొలిరోజు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అదే విధంగా అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు.

ఘనంగా రుక్మిణి కల్యాణం సామూహిక పారాయణం

స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో శ్రావణ మాసం సందర్భంగా హరిసర్వోత్తమ, కోదండరామ, శ్రీకృష్ణ భజన మండలి వార్లుచే శుక్రవారం సౌందర్యలహరి, రుక్మిణి కళ్యాణం సామూహిక పారాయణం జరిగింది. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


యర్రంశెట్టివారిపాలెంలో గోగులమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

నరసాపురం రూరల్: శ్రావణమాసం మొదటిరోజు శుక్రవారం కావడంతో లక్ష్మీదేవి, అమ్మవార్లకు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించార. మహిళలు ఎంతో పవిత్రంగా ఆచరించే శ్రావణమాసం తొలిరోజు లక్ష్మీదేవికి ప్రీతికరమైన శుక్రవారం రోజు కావడంతో అమ్మవారికి కుంకుమ పూజలు, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, తీపి పదార్థాలు మొదలైన వాటిని సమర్పించుకున్నారు. ఈ పూజలు సౌభాగ్యం, సంపద లతో పాటు కుటుంబ క్షేమాన్ని కోరుకుంటూ నిర్వహించారు. నరసాపురం మండలం యర్రంశెట్టివారిపాలెం శ్రీ గోగులమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ, ఎంపీటీసీ ఆకన శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది.

కనకదుర్గమ్మకు అభిషేకం


యలమంచిలి : అమ్మవారి అభిషేకంలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో జరిగిన ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులకు అన్నదానం


అమ్మనాంబ ఆశ్రమంలో భోజనాలు చేస్తున్న వృద్ధులు

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని అమ్మనాంబ ఆశ్రమంలో శుక్రవారం దేవతామూర్తులకు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం దానేశ్వరీ హోరో షోరూం అధినేత సతీష్‌కుమార్ బొల్లా ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులతో పాటు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆశ్రమంలో మాతాశ్రీ శాంతమ్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర నామాలు, గాయత్రి శ్లోకాలు భక్తులు పఠించారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

తాడేపల్లిగూడెం: విధి నిర్వహణలో డాక్టర్లు అలసత్వం వహిస్తే కఠి న చర్యలు తప్ప వని జిల్లా వైద్యాధికారిని డా.జి.గీతాబాయి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. రవిమాధవ్ నర్సింగ్ హోం, విజయ ఆస్పత్రిని సందర్శించారు. ఏపీఎం సీఈ చట్ట పరిధిలో ఆసుపత్రుల్లో నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించారు. రికార్డులను చూశారు. ఎవ్వరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తీసుకొని, ఆసుపత్రులను సీజ్ చేస్తామన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై పోరాటం


సంఘ నాయకులను సత్కరిస్తున్న డీలర్లు

నరసాపురం: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అధికారి ఏసు, కార్యదర్శి కనగళ్ల బాబు, సంయుక్త కార్యదర్శి సమయమంతుల సర్వేశ్వరరావు తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన ముగ్గురు నేతలను శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీలర్లు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం డీలర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటి పరిష్కారానికి కలసికట్టుగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం మహేష్, పొన్నమండ యుగంధర్, జల్లూరి శ్రీనివాస్, శిరిగినీడి మరళి, తటపర్తి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి


తణుకులో అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గీతాబాయ్

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి.గీతాబాయ్ సూచించారు. తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా మునిసిపల్ సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రక్షిత మంచినీరు తాగడం ద్వారా డయేరియా బారినపడకుండా ఉండవచ్చనే విషయాన్ని ప్రజలకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు తప్పవు

స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణుల విషయంలో లింగ నిర్ధారణకు పాల్పడితే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతాబాయ్ హెచ్చరించారు. తణుకు పట్టణంలో శుక్రవారం పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా యాజమాన్యాలు తమ కేంద్రాల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు.

కంటి రుగ్మతలను అశ్రద్ధ చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి

తణుకు అర్బన్: కంటి రుగ్మతలను అశ్రద్ధ చేస్తే కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి అన్నారు. శుక్రవారం తేతలిలోని ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులకు ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పాలకొల్లు లయన్స్ ఆధ్వర్యంలో రాజవల్లి రాధారామన్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ మానవ దేహంలో కంటికి ఎంతో ప్రాధాన్యత ఉందని, కంటిచూపు లేకపోతే జీవితం అంధకారంగా మారుతుందని స్పష్టం చేశారు. ఇదే ఉద్దేశంతో తమ ఇండస్ట్రీస్‌లోని కార్మికులు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్మికులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 365 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 11 మందికి కాట్రాక్ట్ శస్త్రచికిత్సలు, 5 గురికి కంటి పై పొర శస్త్రచికిత్సలు అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారని వారందరికీ శస్త్రచికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేయనున్నామని, 72 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్లూరి లక్ష్మీపతిరాజు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి


సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలపై మరింత కరెంటు భారాలు వేసే అదానీ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పట్టణ ప్రజలకు సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ 5వ రోజు శుక్రవారం ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ర్యాలీలు జరిగాయి. కడకట్ల, రామారావుపేటలలో ప్రచార ర్యాలీ జరిగింది. కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పెంచిన చార్జీలను తగ్గించాలని, ప్రజలపై అదనపు భారాలను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ సంస్కరణలలో భాగంగా టీడీపీ కూటమి ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆలోచన చేస్తుందన్నారు. అదానీ మీటర్లు బిగిస్తామని వస్తే ప్రజలు బుద్ధి చెపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 2 కోట్లు విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి స్థానంలో అదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించాలని కూటమి ప్రభుత్వం చూడటం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు తప్పక కూటమి ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నం రెడ్డి శివాజీ, దత్తు రాము, ఎన్.సాయి, బి.బాలాజీ, బి.శివ, యడ్ల శ్రీను, కె.ఉదయ్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.